క్లుప్తంగా

నేడు డీసీసీ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు

జనగామ: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేడు(ఆదివారం) డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడకలను నిర్వహించనున్నట్లు పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అమరవీరులకు నివాళులర్పిచడంతో పాటు జాతీయ జెండాను ఎగుర వేస్తారన్నారు. వేడుకలకు పార్టీ కేడర్ హాజరు కావాలన్నారు.

వేడుకలను నిర్వహించాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యాలయాలు, జీపీల వద్ద జాతీయ జెండాలను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, గ్రామస్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

మంత్రికి వినతి



స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు బంజారాహిల్స్‌లో శనివారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరాల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొలిపాక సతీష్, సంయుక్త కార్యదర్శి ఏలూరు రవి, కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోమటిరెడ్డిని కలిసిన కిరణ్‌కుమార్‌గౌడ్



జనగామ: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా శనివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం



జనగామ రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన నాయిని ప్రకాశ్ -స్వరూప దంపతుల కుమారుడు రోహిత్ శనివారం పట్టణంలోని రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అమ్మ ఫౌండేషన్ సలహాదారుడు నర్సింహులు, మహేష్, బీమ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని మండల నోడల్ అధికారి డీవీఎల్ ఎన్‌మూర్తి అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి దేవీ ప్రసాద్, కారోబార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

భావతారిణికి కళారత్న అవార్డు



బచ్చన్నపేట: మండలంలోని దబ్బగుంటపల్లి గ్రామానికి చెందిన మూటకోడూరు నాగరాణి, నర్సింహచారి దంపతుల కూతురు భావతారిణి కాశీ నృత్య కళారత్న అవార్డును శనివారం అందుకున్నారు. కాశీ విశ్వనాథ్ అన్నపూర్ణ దేవాలయంలో జరిగిన నృత్య ప్రదర్శనలో శివుడికి ఇష్టమైన శివ పంచాక్షరి మంత్రానికి భావతారిణి నృత్యం చేసి అందరిని ముగ్ధలను చేసింది. అద్భుతమైన ప్రదర్శనకు అవార్డు అందజేశారు. ఇప్పటివరకు కాశీ, అరుణాచలం ఇంకా ఎన్నో ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చి అవార్డులను అందుకుంటూ గురువు రఘుపతి, తల్లిదండ్రుల పేరును ముందుకు తీసుకెళ్తోంది. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న భావతారిణిని పలువురు అభినందించారు.

జనగామ : బాణాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రఘునాథపల్లి: కంచనపల్లి సీతారాముల కల్యాణంలో హనుమాన్ మాలధారులు



కొడకండ్ల: రామవరం నుంచి ఇరుముడులతో బయలుదేరిన హనుమాన్ మాలధారులు



ఘన్‌పూర్‌లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



వైభవంగా హనుమాన్ జయంతి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతిని భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో హనుమాన్ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనగామ పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా ఉప్పలమ్మ సహిత ఆంజనేయస్వామి ఆలయంలో 108 వడలతో తయారు చేసిన మాలలతో పాటు 1,116 తమల పాకులతో స్వామిని అలంకరించారు. రఘునాథపల్లిలోని కంచనపల్లి హనుమాన్ ఆలయంలో భక్తిశ్రద్ధలతో సీతారామచంద్రస్వామికి కల్యాణం నిర్వహించారు. పలు ఆలయాల్లో దాతలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మాలధారులు దీక్షలు విరమించారు. ఘన్‌పూర్ హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో వీర హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జై శ్రీరాం నినాదాలతో ఆలయాలు మారుమ్రోగాయి.



పాలకుర్తి టౌన్: సోమేశ్వరాలయంలో..



నర్మెట: పూజలో పాల్గొన్న మాలధారులు



స్టేషన్‌ఘన్‌పూర్: పూజలు చేస్తున్న పోలీసులు



జనగామ: శ్రీనివాసకాలనీలో..



స్టేషన్‌ఘన్‌పూర్: హోమంలో భక్తులు



జనగామ: ఉప్పలమ్మ ఆలయంలో అన్నదానంలో భక్తులు



జఫర్‌గఢ్: పాతూరిలో..



జనగామ రూరల్: వేడుకలో భక్తులు



పాలకుర్తి టౌన్: పాటిమీది ఆలయంలో..



జనగామ: వడ మాలలతో ఆంజనేయస్వామి



జనగామ: ఆంజనేయ స్వామికి అభిషేకం



జఫర్‌గఢ్‌లో..



బచ్చన్నపేట: కొన్నెలో అన్నదానం చేస్తున్న మాలధారులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు చేసిన ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారంతో రెండో రోజుకు చేరాయి. పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రధానమైన రైతు రుణమాఫీ నేటికి అమలు కాలేదన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీని అమలుచేసి రైతులకు మళ్లీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కాగా, పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ దాడులను ఖండిస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సింగారం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, ప్రకాష్, విజేందర్, యాకయ్య, నరేందర్, ఉపేందర్, షబానా, సాదం రమేష్, గట్ల మల్లారెడ్డి, సారయ్య, మహేందర్ పాల్గొన్నారు.

భూవివాదంపై డీసీపీ విచారణ



రైతులతో మాట్లాడుతున్న డీసీపీ

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామంలో పలువురు రైతుల భూవివాదం విషయమై శనివారం ఆ స్థలాన్ని డీసీపీ సీతారామ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోచన్నపేట గ్రామానికి చెందిన రైతులు సర్వేనంబర్ 422, 423లలో 26 ఎకరాల భూమి విషయంలో తగాదా గురించి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై అట్టి స్థలం వద్దకు వెళ్లి పరిశీలించి చుట్టుపక్కల రైతుల ద్వారా వివరాలను తెలుసుకున్నామని చెప్పారు. భూ సమస్యను మూడు రోజుల్లో పరిష్కరింజేస్తామన్నారు. ఒకరి స్థలంలోకి ఒకరు వెళ్లి వివాదాలకు దారితీయొద్దని రైతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై కంకల సతీష్‌కుమార్, కానిస్టేబుళ్లు జమాలొద్దీన్, అనిల్‌కుమార్ పలువురు రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తన షాపులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

రఘునాథపల్లి: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పురం యుగేందర్ హెచ్చరించారు. శనివారం టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని 8 విత్తనాలు, ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డిమాండ్ ఉన్న పత్తి విత్తన ప్యాకెట్లు బ్లాక్‌లో విక్రయించినా.. నకిలీ విత్తనాలు అంటగట్టినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఎస్సై నరేష్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నకిలీ, విడి విత్తనాలు కొని మోసపోకండి

దేవరుప్పుల: నకిలీ, విడి విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని వ్యవసాయ విస్తరణాధికారి సూదగాని సాగర్ సూచించారు. మండలంలోని గొల్లపల్లిలో ఉపాధి హామీ పనుల వద్ద రైతులకు విత్తనాల కొనుగోలు జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు.

బీఎన్ఆర్‌కేఎస్ అడ్‌హక్ కమిటీ ఎన్నిక



కమిటీ బాధ్యులతో మధు

స్టేషన్‌ఘన్‌పూర్: భవన నిర్మాణ రంగాల కార్మికుల సంఘం మండల అడ్‌హక్ కమిటీని శనివారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. స్థానిక బీఎన్ఆర్‌కేఎస్ భవనం వద్ద సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామగళ్ళ కృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి చింత శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం మండల అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా పండుగ రాజు, కోకన్వీనర్లుగా కలకోల ఎల్లయ్య, చెరిపల్లి రాజు, చింత వెంకటయ్య, తాటికొండ బాలకృష్ణ, కె.రామక్రిష్ణ, మారపాక రాజు, అన్నెపు సమ్మయ్య, ఆదామ్, వెంకటేశ్వర్లు, రవి, రమేష్, నర్సయ్య, లింగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగాల కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, న్యాయమైన హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలన్నారు.

'రాష్ట్ర చిహ్నం మార్పుపై నోరు తెరవండి'



మాట్లాడుతున్న రాజయ్య

లింగాలఘణపురం: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చిహ్నం మార్పుపై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నంపై ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు నోరు తెరవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని కల్లెంలో విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర చిహ్నం మారుస్తామని చెప్పడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమకారులు మరో ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయలకు పెట్టింది పేరుగా ఉన్న చిహ్నంపై, తెలంగాణ గేయంపై చేస్తున్న పిచ్చి పనులను మానుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చంద్రమౌళి, కరుణాకర్, ఆదాం, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నియామకం

జఫర్‌గఢ్: మండలంలోని రేగడితండా గ్రామ శివారు కేజీతండాకు చెందిన భూక్య కీమానాయక్‌ను కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నునావత్ సుమన్ నాయక్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కీమానాయక్‌తో పాటు ఎస్టీసెల్ మండల ఉపాధ్యక్షుడిగా సుధాకర్, కోఆర్డినేటర్‌గా సంతోష్, కార్యవర్గ సభ్యులుగా రెడ్యానాయక్, అశోక్ నియమితులయ్యారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హృతిక్ సాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ కె రాముకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కార్తీక్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తే కేసులా?

చిల్పూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఎవరినైనా ప్రశ్నించే అధికారం ఉందని.. అలాగే చిల్పూరు తహసీల్దార్‌ను అక్రమ రిజిస్ట్రేషన్ విషయమై ప్రశ్నిస్తే కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ అమరులకు నివాళి

దేవరుప్పుల: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు మండలంలోని కార్యాలయాల్లో అధికారులు శనివారం ఏర్పాట్లను చేశారు. తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ రాములు, పోలీస్ స్టేషన్‌లో సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై ప్రసన్న కుమార్‌లు ఉన్నారు.

కావ్య గెలుపొందాలని మేడారంలో పూజలు

జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మెరుగు మహేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ తాటికాయల అశోక్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నాయకులు ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య విజయం సాధించాలని మేడారంలో సమ్మక్క-సారలమ్మకు శనివారం పూజలు నిర్వహించారు.

గన్‌పార్క్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా శనివారం బీఆర్ఎస్ నేతలు హైదారాబాద్ గన్‌పార్క్‌కు మండలంలోని పెంబర్తి నుంచి తరలివెళ్లారు. గన్ పార్క్ నుంచి తెలంగాణ అమరవీరుల జ్యోతి వరకు క్యాండిల్ ర్యాలీకి అధిక సంఖ్యలో తరలి వెళ్లినట్టు మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల స్వామి తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బచ్చన్నపేట: పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని చిన్నరామన్‌చర్ల జీపీ కార్యదర్శి భానుచందర్ అన్నారు. శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆహార పదార్థాలు, గుడ్లను పరిశీలించి మాట్లాడారు.

ఆర్థికసాయం

పాలకుర్తి: మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన ఎలిగేటి సోమన్న ప్రమాదవశాత్తు గాయపడి ఇంట్లో చికిత్స పొందుతున్నాడు. కాగా, శనివారం ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు సోమన్నకు రూ. 10 వేల సాయం అందజేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌కు సంబంధించిన చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రవియాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగి కొమురయ్య (55) ధర్మసాగర్ మండలంలోని సాయిపేటలో బంధువు మృతి చెందడంతో శుక్రవారం వెళ్లాడు. దహనసంస్కారాల అనంతరం అదే రోజు స్వగ్రామంలోని తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తూ రిజర్వాయర్ చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయాడు. కొమురయ్య శనివారం ఉదయం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల ఇళ్లలో వెతికారు. ఈ క్రమంలో చెరువులో శవమై కొమురయ్య కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరునవిలపించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికసాయం

చిల్పూరు: ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పన్నీరు సారయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీపతిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మాలోత్ రాజు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.